క్లుప్తంగా

సచివాలయానికి కంప్యూటర్ వితరణ



సచివాలయ కార్యదర్శికి కంప్యూటర్‌ను అందజేస్తున్న కిషోర్

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గ్రామ సచివాలయానికి కార్యాలయ అవసరాల కోసం సమీపంలోని సీసీఎల్ కాఫీ పరిశ్రమ వారు కంప్యూటర్, ప్రింటర్లను వితరణగా అందజేశారు. ఎంపీడీఓ ప్రసాద్ చేతుల మీదుగా పరిశ్రమ పీఆర్వో కిషోర్ సచివాలయ కార్యదర్శి హబీబ్‌కు అందజేశారు.

గుడిమల్లంలో విశ్రాంత డిప్యూటీ ఈఓ



పరశురామేశ్వరుని దర్శించుకున్న టీటీడీ విశ్రాంత డిప్యూటీ ఈఓ

ఏర్పేడు(రేణిగుంట): టీటీడీ విశ్రాంత డిప్యూటీ ఈఓ కె.నాగరాజు శుక్రవారం ఏర్పేడు మండలం గుడిమల్లంలోని ప్రఖ్యాత శైవక్షేత్రమైన పరశురామేశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు దర్శనం చేయించి, ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. రేణిగుంట మండలం ఎల్లమండ్యం సమీపంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ డివిజన్ నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేందర్ నాయుడు, ఈఈ చంద్రశేఖర రావు, డీఈఈ రమేష్ బాబు, ఏఈలు పుణ్యకోటి, హరిప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ కుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే

సత్యవేడు: మండలంలోని పివీ పురంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం పూజల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆలయ పూజల్లో శుక్రవారం ఉదయం పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అమ్మవారి ప్రసాదం అందజేశారు. అంతకు ముందు చమర్తికండ్రిగలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



ఏర్పేడు: అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

ఏర్పేడు (రేణిగుంట): తగిన జాగ్రత్తలను పాటిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తే అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య అన్నారు. ఏర్పేడు మండలం పాగాలి సమీపంలోని రాక్‌మెన్ పరిశ్రమలో శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది, యాజమాన్యానికి కరపత్రాలను అందించారు. పరిశ్రమలో ఎలక్ట్రికల్ ఫైర్స్, కెమికల్ ఫైర్స్, హైడ్రోజన్ ఫైర్స్, ఫర్నిష్ ఆయిల్ ఫైర్స్ వంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాద తీవ్రత ఎక్కువ కాకుండా వ్యవహరించాల్సిన తీరు, నివారణ చర్యలను గురించి డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలవల్లం సమీపంలో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణాలు, బత్తవల్లం - కారిపాకం వెళ్లే మార్గంలోని పొలాల్లో నిర్మితమైన డూప్లెక్స్ ఇళ్లు, మత్తేరిమిట్ట వద్ద పొలాల్లో నిర్మాణమవుతున్న అపార్ట్‌మెంట్లు







పల్లెలు.. బహుళ అంతస్తులు

కొన్నేళ్ల కిందటి వరకు ఆ పల్లెటూళ్లు.. పచ్చని పంటలతో ఏడాదికి రెండు పంటలు పండే భూములతో కళకళలాడేవి. నేడు అదే పచ్చని భూముల్లో పట్టణ వాతావరణం ప్రత్యక్షమవుతోంది. రోజురోజుకూ బహుళ అంతస్తుల భవంతులు నిర్మాణం అవుతుండడంతో ఆ ప్రాంతం పూర్తిగా పట్టణ వాతావరణాన్ని సంతరించుకుంటోంది. ఒకప్పుడు పల్లెటూరి ప్రజలు ఉన్న ఈ ప్రాంతంలో నేడు వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు కలియ తిరుగుతుండడం.. విభిన్న భాషల్లో మాట్లాడేవారు, విభిన్న సంస్కృతులతో ఉండే వారితో ఆ ప్రాంతం కళకళలాడుతోంది. అంతేకాక ఆ ప్రాంతం అన్ని రకాల వ్యాపారాలతో దూసుకెళ్తోంది. ఆ పల్లెటూర్లే వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం, మత్తేరిమిట్ట, చిలమత్తూరు గ్రామ పంచాయతీలు.. వాటి గురించి తెలుసుకుందాం.

- పల్లెటూర్లలో పట్టణ వాతావరణం
- పచ్చని పొలాల్లో జోరుగా అపార్టుమెంట్ల నిర్మాణం
- కాలుష్యానికి దూరంగా ఉండడంతో నివాసానికి ఆసక్తి
- బత్తలవల్లం, మత్తేరిమిట్ట, చిలమత్తూరు పంచాయతీల్లో పెరిగిన అపార్టుమెంట్ల సంస్కృతి



రాచకండ్రిగ వద్ద బహుళ అంతస్తుల భవంతులు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తవల్లం, చిలమత్తూరు, మత్తేరిమిట్ట గ్రామ పంచాయతీలు ఒకప్పుడు అవి పూర్తిగా గ్రామీణ ప్రాంతాలు. ఇక్కడ పూర్తిగా వ్యవసాయమే జీవనాధారంగా ఆ ప్రాంత ప్రజలు ఉపాధి పొందేవారు. ఆ గ్రామాలకు ఆనుకుని ఉన్న భూముల్లో ఏడాదికి రెండు సార్లు వరి, వేరుశనగ పంటలను పుష్కలంగా పండించేవారు. ఆ భూములకు అటు చెరువు నీళ్లు, ఇటు బోర్లలో నీరు పుష్కలంగా ఉండడంతో పంటలు సైతం బాగా పండేవి. ఇవన్నీ గతంలో పరిస్థితులు కాగా నేడు అందుకు భిన్నంగా మారిపోయాయి.

పచ్చని పొలాల్లో భవంతులు

బత్తలవల్లం, రాచకండ్రిగ, మత్తేరిమిట్ట, చిలమత్తూరు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది. పచ్చని పొలాల్లో సైతం విశాలమైన రోడ్లతో భవంతులు నిర్మిస్తున్నారు. రోజురోజుకూ ఈ ప్రాంతం పట్టణ వాతావరణం కనిపిస్తోంది. ప్రైవేట్, రియల్ వ్యాపారస్తులు ఒకరికొకరు పోటీతత్వంతో అన్ని హంగులతో నిర్మాణం చేసి కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు. ఇటు తడ, సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాల్లో లేని విధంగా ఈ గ్రామాల్లో బహుళ అంతస్తులతో కూడిన అపార్టుమెంట్లు నిర్మించడం గమనార్హం.

పరిశ్రమల ఉద్యోగుల నివాసాలు అక్కడే !

అటు శ్రీసిటీ, ఇటు వెలుపల చిన్న పాండూరు సమీపంలో విస్తరించిన ఏపీఐఐసీ పారిశ్రామిక వాడ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, మరికొందరు మధ్య తరగతి ఉద్యోగులు పూర్తిగా బత్తలవల్లం, మత్తేరిమిట్ట, రాచకండ్రిగ, చిలమత్తూరు ప్రాంతాల్లోనే నివాసముంటారు. ఇక్కడ ఎవరి స్థాయికి తగిన విధంగా వారు భవనాలు నిర్మాణం చేసి ఉండడంతో కొందరు బహుళ అంతస్తుల భవంతుల్లో సొంతంగా ఫ్లాట్లు కొనుగోలు చేసుకుంటారు. మరికొందరు అద్దెకు, ఇంకొందరు హాస్టళ్లలో ఉంటారు. ఇలా ఎవరి స్థాయికి తగిన విధంగా భవంతులు ఉండడంతో పరిశ్రమలకు చెందిన ఉద్యోగులకు ఈ ప్రాంతం అనుగుణంగా మారింది. అంతేకాక 2 కి.మీల దూరంలో శ్రీసిటీ ఉండడం కూడా వీరికి అనుకూలంగా మారింది.



చిలమత్తూరు వద్ద ఏర్పాటైన లేఅవుట్

శ్రీసిటీ రాకతో మారిన గ్రామాల రూపురేఖలు

బత్తవల్లం, మత్తేరిమిట్ట, చిలమత్తూరు, రాచకండ్రిగ గ్రామాలకు ఆనుకుని 2008లో శ్రీసిటీ ఏర్పాటైంది. అక్కడ పరిశ్రమలు విడతల వారీగా ఏర్పాటవుతుండడంతో అందుకు దీటుగా ఈ గ్రామాల్లో భూములకు సైతం ఎక్కడ లేనంత విలువ పెరిగింది. 2012 నుంచి ఇంకాస్త ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో అంతేకాక ఈ నాలుగు గ్రామాల్లో రియల్ వ్యాపారం ఊపందుకుంది. కొందరు ప్రైవేట్ వ్యాపారులు వెంచర్లు వేసి అభివృద్ధి చేయగా మరికొందరు బహుళ అంతస్తులతో అపార్ట్‌మెంట్లు నిర్మించారు. దీంతో ఆ ప్రాంతాలు ఒక్కసారిగా మారిపోయాయి. పచ్చని పొలాలు సైతం వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి.

చేరువలో రైల్వే స్టేషన్

అటు పరిశ్రమలు, ఇటు నివాసాలకు అనుగుణమైన భవంతులు వీటికి తోడు అందినంత దూరంలో తడ-సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లలో ఉండడంతో ప్రతి ఒక్కరూ నివాసానికి ఈ ప్రాంతమే ఎంచుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగా 4, 6 అంతస్తుల అపార్టుమెంట్లు ఉండడంతో అందులో ఫ్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రజల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్మూలనకు సహకరించండి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రోజురోజుకూ పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్మూలనకు మండలంలోని ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీఓ విష్ణు చిరంజీవి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు ఇ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక కౌంటర్, ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలో ప్రత్యేక బాక్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అందులో వేయాలని కోరారు.

పోటీ పరీక్షల పుస్తకాల వితరణ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్వీఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఎస్వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు చెందిన పుస్తకాలను వితరణగా అందజేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శుక్రవారం సంస్థ చైర్మన్ విజయలక్ష్మి, మావుదూరు మోహన్ స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సంబంధించి తమ సంస్థ ద్వారా అందజేస్తున్న పుస్తకాలు ఎంతో ఉపయోగకరమని వారు వివరించారు.

ముగిసిన శ్రీరామనవమి వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వెలంపాళెంలోని సీతారామ మందిరంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వీధిలోని చిన్నారులు ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ప్రతి ఇంటి వద్ద పసుపు నీళ్లను పెట్టారు. దీంతో చిన్నారులు వాటిని ఒకరిపై ఒకరు పోసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు







లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, జీవాగ్రంలో ప్రసంగిస్తున్న చర్చి ఫాదర్, బుచ్చినాయుడుకండ్రిగ చర్చిలో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని చర్చి, ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు ఎంతో పవిత్రంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధానంగా ఆర్‌సీఎం చర్చ్, లూథరన్ చర్చ్, జీవాగ్రం సేయింక్ లూక్ లూథరన్ చర్చిలలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు ఆచరించారు.ఆర్సీఎం చర్చిలో యేసు ప్రభు ఊరేగింపు, శిలువ వంటి ఘట్టాలను కళ్లకు కట్టేటట్లు చిన్నారుల చేత ప్రదర్శన చేయించారు. మత బోధకులు, పాస్టర్లు గుడ్ ఫ్రైడే విశిష్టతను బోధించారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రేణిగుంటలోని చర్చిలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని 36 చర్చిల్లో గుడ్ ఫ్రై డే నిర్వహించారు. క్రైస్తవ సోదరులు చర్చికి వెళ్లి భక్తి శ్రద్ధలతో బైబిల్‌ను పఠనం చేసి, ప్రార్థనలు చేశారు. పాస్టర్లు భక్తిగీతాలను ఆలపించి, భక్తులచే ప్రార్థనలను చేయించారు. చర్చిల్లోని ప్రార్థనల్లో భారీసంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ముస్లింలు

శ్రీకాళహస్తి: వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని పలువురు ముస్లింలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా పట్టణంలోని పెద్ద మసీదు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. వారికి వామపక్ష పార్టీల నాయకులు మద్దతు పలికారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు గోరా, పఠాన్ ఫరీద్, లాలు, అస్లాం, అబ్దుల్ కలాం, ఫజల్, మసీదు మౌలానాలు, వామపక్ష నాయకులు బాలసుబ్రహ్మణ్యం, గురవయ్య, రాజా, ఎస్ఎం షరీఫ్ పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో దాహం కేకలు



వ్యవసాయ బోర్ల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీఎస్ పురం గ్రామ పంచాయతీ పరిధిలోని అరిగిలకండ్రిగ గిరిజన కాలనీలో తాగునీటి మోటారు మరమ్మతులకు గురికావటంతో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గిరిజన కాలనీలో 70 గిరిజన కుటుంబాలున్నాయి. మూడు రోజులుగా తాగునీటి మోటారు మరమ్మతులకు గురై పనిచేయడం లేదు. దీంతో నీటి కోసం గిరిజనులు బిందెలు చేతబట్టి కిలోమీటరు దూరంలో ఉన్న వ్యవసాయ బోరు మోటార్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. బోరు మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీటిని అందించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. తాగునీటి సమస్యలను పరిష్కరించవలసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పత్తాలేరని గిరిజనులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి గిరిజన కాలనీలోని తాగునీటి బోరు మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు.



మరమ్మతులకు నోచుకొని బోరుమోటారు



నోరూరించే పండ్లు.. చూడగానే కొనాలనిపిస్తుంది.. వెంటనే తినాలనిపిస్తుంది. కనువిందుగా కనిపించే అమృతఫలాలు సైతం విషతుల్యంగా మారిపోతున్నాయి. మధురమైన రుచితోపాటు రసాయనాలను శరీరానికి చేరవేస్తున్నాయి. ఆకట్టుకునే రంగు కోసం పలువురు వ్యాపారులు కృత్రిమ విధానాలు పాటించడం వల్లే దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి. సహజ పద్ధతుల్లో పండ్లను మగ్గబెడితేనే సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. కెమికల్స్ వాడని ఫ్రూట్స్‌నే భుజించాలని కోరుతున్నారు. –తిరుపతి మంగళం

సహజం.. సఫలం!

- రసాయనాలతో మగ్గిస్తే విషతుల్యం
- మార్కెట్‌లో యథేచ్ఛగా కృత్రిమ విధానాల వినియోగం
- కెమికల్స్ వాడకంతో పండ్లు విషతుల్యం
- భుజించిన వారికి తప్పదు అనారోగ్యం
- పండ్ల కొనుగోలులో అప్రమత్తం

వేసవి సీజన్ వచ్చిందో లేదో అప్పుడే మార్కెట్‌లోకి మామిడి పండ్లు వచ్చేశాయి. అలాగే వాటర్ మిలన్, మరోవైపు ద్రాక్ష, ఆల్ సీజనల్ ఫేవరెట్ అరటి ఇలా అన్ని రకాల పండ్లు వీధివీధిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే ఆరోగ్యం కోసం ఇష్టంగా కొనుగోలు చేసే పండ్లతో ప్రమాదకర రసాయనాలు కూడా మన ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయి. ప్రధానంగా ఈ సీజన్‌లో మాత్రమే దొరికే మామిడి పండ్లు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను తీసుకొచ్చే ప్రమాదముంది. ఈ తరుణంలో అసలు మంచి పండ్లను ఎలా గుర్తించాలి అనే అంశంపై నగరవాసులు దృష్టి సారిస్తున్నారు.

గుర్తించడం ఎలా..

- సంప్రదాయ పద్ధతిలో పండిన ఫలాలు కమ్మని, తియ్యటి వాసనతో ఉంటాయి.
- ఈ పండ్లపై నల్లటి మచ్చలు కనిపిస్తాయి. ఫలాలను తెంపిన కాడ తాజాగా కాకుండా వాడిపోయినట్టు ఉంటుంది. ఈ పండ్లపై కాసింత గడ్డి పొట్టు, సన్నని బూజు కనిపిస్తాయి.
- సహజంగా మగ్గించిన వాటిని గుర్తు పట్టాలంటే ఒక బకెట్‌లో నీరు నింపి అందులో పండ్లు వేయాలి. సక్రమంగా పండించిన ఫలాలు నీటి అడుగు భాగానికి చేరుకుంటాయి. ప్రమాదకర రసాయనాలతో మగ్గించినవి మాత్రం నీటిపైకి తేలుతాయి.
- కాల్షియం కార్బైడ్ నీళ్లలో పండ్లను ఉడకబెట్టి కృత్రిమంగా మగ్గించినవి ఆకారం కోల్పోయి గుండ్రంగా మారుతాయి. అలాగే రసాయనాలతో పండించినవి తాజాగా, నిగనిగలాడుతూ కనిపిస్తాయి. ఈ ఫలాలు వాటి సహజమైన రుచిని చాలా వరకు కోల్పోతాయి.
- రసాయనాలు చల్లిన పండ్లపై ఆకుపచ్చ, బ్రౌన్ కలర్‌లో మచ్చలు ఉంటాయి.

నిషేధించినా.. వాడేస్తున్నారు!

వేసవిలో పండ్లను ఎక్కువగా భుజించడానికి ప్రజలు అధికంగా ఆసక్తి చూపుతుంటారు. ముఖ్యంగా వేసవి తాపానికి డీహైడ్రేషన్‌కు గురి కాకుండా పళ్ల రసాలను తాగుతుంటారు. దీన్ని అదునుగా కొందరు వ్యాపారులు ప్రమాదకర పంథాను ఎంచుకుంటున్నారు. సహజసిద్ధంగా పండ్లను మగ్గించడానికి బదులు కృత్రిమ పద్ధతిలో రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా కాల్షియం కార్బైడ్ వంటి విషపూరిత రసాయనాలను వినియోగిస్తున్నారు. ఈ పదార్థం పలు అనారోగ్యాలకు కారణమని, దీంతో పండ్లను మగ్గించవద్దని గతంలోనే నిషేధం విధించారు. అయినప్పటికీ మార్కెట్ అవసరాల కోసం కొందరు వ్యాపారులు ఈ రసాయనాలను వాడుతూనే ఉండడం ఆందోళనకు గురిచేస్తోంది.

నిర్లక్ష్యానికి తుప్పు !



గృహనిర్మాణశాఖ పేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఇనుప కడ్డీలు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, గృహనిర్మాణ శాఖ ఒక్క నిర్మాణం కూడా చేయకపోవడంతో ఏర్పేడు మండల పరిషత్ కార్యాలయం ముందు ఆరు బయట పేదలకు అందించాల్సిన ఇనుప కడ్డీలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కడ్డీలు ఎండకు ఎండి, వానకు తడిసి.. తుప్పు పడుతున్నాయి. –ఏర్పేడు(రేణిగుంట)

పూదోటకు చీరామరక్ష



నియోజకవర్గంలోని పిచ్చాటూరు మండలంలో వివిధ రకాల పూలతోటలు పలు గ్రామాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. పశువులు, మేకలు, గొర్రెలతో పాటు అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ మేరకు పిచ్చాటూరు సమీపంలోని సాగు చేసిన రోజా పూలతోటకు రక్షణగా పాత చీరలను కట్టి పంటను కాపాడుకుంటున్నారు. –వరదయ్యపాళెం